క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి అభిషేకం చేస్తున్న భక్తులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 2,500వేలకు మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. అలాగే స్వావారికి 112అభిషేకాలు జరిగాయన్నారు. స్వామి వారి దర్శనానికి గంటన్నర సమయం పట్టిందని భక్తులు పేర్కొన్నారు. భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేసినట్లు అధికారులు తెలిపారు. ఆషాడం, అష్టమి నేపథ్యంలో భక్తుల రద్దీ తగ్గిందని ఆలయ అధికారులు తెలిపారు.

కొనసాగుతున్న వరద



సి.బెళగల్: తుంగభద్ర నదిలో వరదనీటి ప్రవాహం ఆదివారం సైతం పెద్ద ఎత్తున కొనసాగింది. రెండు రోజులు కిందట ఎగువ ప్రాంతాల నుంచి విడుదలైన వరదనీర నదిలో పెద్ద ఎత్తున ప్రవహిస్తుంది. నదీతీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. గ్రామ సచివాలయాల ఉద్యోగులు వరదనీటి ప్రవాహంపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని మండల అధికారులకు తెలియజేస్తున్నారు. సోమవారం నదిలో వరదనీటి ప్రవాహం కొంత మేర తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలియజేశారు.

సీజ్ చేసిన వాహనాల వేలం



వేలం పాట నిర్వహిస్తున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు ఆదివారం సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది వేలం పాట నిర్వహించారు. మొత్తం 12వాహనాలకు వేలం పాట నిర్వహించగా పాటదారులు 11వాహనాలకు పాట పాడారన్నారు. జీఎస్టీతో కలిపి మొత్తం రూ.2,54,290 ఆదాయం వచ్చినట్లు సెబ్ సీఐ రామాంజినేయులు తెలిపారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ అలీబేగ్ ఉన్నారు.

ప్రజా వేదికను సద్వినియోగం చేసుకోండి

ఓర్వకల్లు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నటరాజ్ ప్రజలకు సూచించారు. ప్రతి వారం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలతో పాటు, వివాదస్పదమైన భూముల సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అనుపమ సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కారవేదిక నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఇతిహాసాలపై అవగాహన



సందేశమిస్తున్న ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు

కర్నూలు కల్చరల్: పురాతన ఇతిహాసాల గురించి భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు అన్నారు. అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని శ్రీ పూరీజగన్నాథ మందిరంలో ఆదివారం నగర సంకీర్తన, భగవద్గీత శిక్షణా తరగతులు జరిగాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హరినామ సంకీర్తన, రాజభోగ హారతి, ఆశీర్వాదం, మహా ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా రఘునందన సేవక్ ప్రభు సందేశమిస్తూ రామాయణ భారత భాగవతాల్లోని అంశాలు మన జీవితానికి ఉన్నత మార్గాన్ని చూపుతాయన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సాగు సాయం ఏదీ?

- అన్నదాతకు ఏడాదికి రూ.20 వేలు అంటూ హామీ గుప్పించిన చంద్రబాబు
- రైతుభరోసా పేరు మార్చారే తప్పా... పెట్టుబడి సాయం ఊసెత్తని టీడీపీ ప్రభుత్వం
- ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలవుతున్నా అన్నదాత సుఖీభవ సాయంపై స్పష్టతివ్వని కూటమి సర్కార్
- ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్న అన్నదాత



పెద్దపాడు సమీపంలో సాగైన మొక్కజొన్న

కల్లూరు: రైతన్నకు టీడీపీ పాలనలో సాగు ఇబ్బందులు తప్పడం లేదు. ఖరీఫ్ సాగుకు పెట్టుబడి సాయం అందుతుందని ఆశపడిన రైతులకు నిరాశే మిగిలింది. గత ఎన్నికల్లో రైతులకు పెట్టుబడి సాయం రూ. 20 వేలు అందజేస్తామని హామీ గుప్పించిన చంద్రబాబు మొండి చెయ్యి చూపారు. గత జగనన్న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రైతుభరోసా పథకం పేరును.. అన్నదాత సుఖీభవ అంటూ టీడీపీ సర్కార్ పేరు మార్చిందే తప్పా పెట్టుబడి సాయాన్ని మరిచిందని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జూన్ 1 నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభవ్వగా అప్పట్లో వర్షాలు అనుకూలంగానే కురిశాయి. అనంతరం వరుణుడు ముఖం చాటేయ్యడంతో సాగు చేసిన పంటలు వాడుపట్టాయి. అయితే వారం క్రితం కురుసిన వర్షాలు పైరును ప్రస్తుతానికి ఓ విధంగా కాపాడాయి. మరి కొందరు విత్తనం వేసేందుకు సిద్ధం అవుతున్నారు. అయితే పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు నిరాశకు గురువుతున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకానికి సంబంధించి తొలి విడత సాయంగా రూ.2వేలు రైతుల ఖాతాల్లో జమ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయంపై ఊసేలేదు. మే నెలలోనే రైతు భరోసా నగదు రూ. 5,500 ఇవ్వాల్సి ఉండగా ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో అది కాస్త ఆగిపోయింది. ప్రస్తుతం కేంద్రం అందజేసిన పీఎం కిసాన్ నగదు వేసవి దుక్కులు, కూలీల ఖర్చులకు ఉపయోగపడింది. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కోసం రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు రైతులు .

జగనన్న ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయం

గతంలో పంటల సాగు పెట్టుబడి కోసం రైతన్నలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగు ఆరంభంలోనే పెట్టుబడి సాయాన్ని అందించేది. పీఎం కిసాన్ సాయం రూ. 6వేలు, రైతు భరోసా రూ.7,500 కలిపి ఏటా రూ.13,500 చొప్పున మూడు విడతలుగా రూతులకు అందేది. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో మళ్లీ కష్టాలు మొదలయ్యాయని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సాయం కోసం రైతుల ఎదురు చూపు

కర్నూలు వ్యవసాయ డివిజన్‌లోని కోడుమూరు నియోజకవర్గంలోని (కర్నూలు రూరల్, కోడుమూరు, గూడూరు, సీ.బెళగల్), పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు, కల్లూరు మండలాలకు చెందిన సుమారు 62, 852 మంది రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఆయా మండలాల్లో కొందరూ రైతులు ఇప్పటికే పత్తి, కంది, మొక్కజొన్న, ఉల్లి తదితర పంటలు సాగు చేశారు. మరికొందరు విత్తనాలు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. గతంలో పీఎం కిసాన్‌తోపాటు రైతు భరోసా ఒకేసారి అందుతుడడంతో పెట్టుబడికి ఉపయోగడేది. ఇప్పుడు పీఎం కిసాన్ రూ. 2వేలు మాత్రమే అందడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 20వేలు అందజేస్తామని కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. కూటమి ప్రభుత్వం వచ్చి నెలన్నర గడిచినా రైతుల పెట్టుబడి సాయంపై కనీసం ప్రకటన చేయలేదు. దీంతో సాగు ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

పెట్టుబడి సాయం అందించాలి



గత ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయం అందేది. దీంతో పంట పెట్టుబడి కోసం ఎంతో ఉపయోగపడేది. ప్రస్తుతం ఖరీఫ్ సాగు సీజన్ ముగుస్తున్నా ఇంత వరకు ప్రభుత్వం పెట్టుబడి సాయం ప్రకటించలేదు. ప్రభుత్వం వెంటనే రైతులకు పెట్టుబడి సాయం అందించాలి.

– అబ్దుల్ సుకూర్, రైతు, దొడ్డిపాడు

సీజ్ చేసిన మద్యం ధ్వంసం



సీజ్ చేసిన మద్యాన్ని ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తు పట్టుబడిన మద్యం బాటిళ్లను ఆదివారం కర్నూలు సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ధ్వంసం చేశారు. కోడుమూరు నుంచి పత్తికొండకు వెళ్లేదారిలో పాత హంద్రీనది బ్రిడ్జి సమీపాన 27కేసుల్లో పట్టుబడ్డ 1,780లీటర్ల తెలంగాణ మద్యంతో పాటు, 13కేసుల్లో సీజ్ చేసిన 204లీటర్ల నాటు సారా, 13కేసుల్లో సీజ్ చేసిన 40లీటర్ల ఆంధ్ర మద్యాన్ని ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ రామాంజినేయులు తెలిపారు. ఈ మద్యం విలువ రూ.13,40,870 వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



రాజునాయక్ (ఫైల్)

గడివేముల: గని గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎల్‌కే తండా గ్రామానికి చెందిన రాజు నాయక్ (45), సావిత్రిబాయి దంపతులకు ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వారి కుమారుడు పాణ్యంలోని ఓ పాఠశాలలో చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో కుమారుడిని చూసేందుకు బైక్‌పై రాజు నాయక్, భార్యతో పాటు తమ్ముని కుమారుడితో పాణ్యం వెళ్లారు. అక్కడి నుంచి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో గని సమీపంలోని క్రషర్ ఫ్యాక్టరీ వద్ద ఎదురుగా కంకర లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజు నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మారిన ప్రభుత్వం... నిలిచిపోయిన రోడ్డు పనులు !



గూడూరులోని హైస్కూల్ సమీపంలో రోడ్డుపై పరచిన కంకర



గూడూరు సుబ్బన్నతోట మలుపు వద్ద పూర్తి అయిన కల్వర్టు

కోడుమూరురూరల్: కోడుమూరు–గూడూరు రోడ్డు అధ్వానంగా ఉండేది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా రోడ్డు అభివృద్ధి కొరకు ఎదురు చూశారు గూడూరు ప్రజలు. గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోడుమూరు–గూడూరు రోడ్డు నిర్మాణానికి రూ. 6.70 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు ఫిబ్రవరిలో కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్‌లు రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. బీటీ రోడ్డు పనులను చురుగ్గా చేపట్టిన ఆర్‌అండ్‌బి అధికారులు ఎన్నికల నాటికి 60 శాతం పూర్తి చేశారు. గూడూరు నుంచి చనుగొండ్ల మీదుగా కోడుమూరు వరకు 12కి పైగా కల్వర్టులను పూర్తి చేశారు. అదేవిధంగా రోడ్డును చదును చేసి కంకర వేసే పనులు కూడా ముగిశాయ. అయితే ఎన్నికల అనంతరం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రోడ్డు పనులకు బ్రేకులు పడ్డాయి. రోడ్డు పనులు ముందుకు సాగక ఎక్కడికక్కడే నిలిచిపోయింది. దీంతో కంకర పరచిన రోడ్డుపై ప్రయాణించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల్లో రోడ్డు పూర్తి అవుతుందన్న ఆశతో ఉన్న ప్రజలకు నిరాశే ఎదురైంది. రెండు నెలలుగా పనులు నిలిచిపోవడంఓ ఆయా గ్రామాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయించాలని కోరుతున్నారు.

నాణ్యమైన ఆహారం అందించండి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం హాస్టళ్లలోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ ఆదేశించారు. వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లుతో కలిసి వీసీ ఆదివారం మధ్యాహ్నం భోజన సమయంలో వర్సిటీ మెస్స్ హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆహారాన్ని వృథా చేయొద్దని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టళ్లలో వసతులను మెరుగు పరుస్తామని, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఉన్నత విద్య కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలుగుతూ ఉన్నతంగా చదువుకొని వృద్ధిలోకి రావాలన్నారు.



వర్సిటీ హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకే నాయక్

వేడుకగా సాయి శత రుద్రీయం

కర్నూలు కల్చరల్: శ్రీ సత్యసాయి సేవా సమితి ఇస్కాల సత్రం ఆధ్వర్యంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 100వ జయంతి పురస్కరించుకొని ఆదివారం నమామి సాయి శత రుద్రీయం కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. వెంకటరమణ కాలనీలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో నగరంలోని వీధుల్లో స్వామి వారి చిత్ర పటంతో శోభాయాత్ర నిర్వహించారు. ప్రశాంతి పతాకా విష్కరణ, గోమాత పూజ, శ్రీ సత్యసాయి ప్రేమ తరు (మొక్కలు నాటడం), మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సమితి జిల్లా అధ్యక్షుడు డి.సాయిక్రిష్టారెడ్డి, కన్వీనర్ జి.విశ్వనాథం, రాష్ట్ర వేద ధ్యాన ఇన్‌చార్జ్ హరిశర్మ, డాక్టర్ రంగయ్య, పట్టాభి, మాకా అశోక్‌కుమార్, సందీప్, సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సాయి చిత్రపటంతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

నూతన చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ అబ్దుల్ గౌస్

కర్నూలు: నూతన చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దిశ మహిళా పీఎస్ సీఐ టీ.అబ్దుల్‌గౌస్ సూచించారు. డీఎస్పీ బాబూప్రసాద్ పర్యవేక్షణలో ఆదివారం మహిళా పోలీస్‌స్టేషన్‌లో గ్రామ/వార్డు మహిళా పోలీసులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐ గౌస్ మాట్లాడుతూ.. జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య అధీనియం తదితర వాటితో పాటు కొత్త, పాత చట్టాలకు సంబంధించి మార్పులు, సవరణపై అవగాహన కల్పించారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలు కలుగుతుందన్నారు. నూతన అంశాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని, వాటిపై అవగాహన ఉంటేనే రాను న్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలో తెలుస్తుందని చెప్పారు. ఏఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలి, చార్జ్‌షీట్ ఎలా తయారు చేయాలి, దర్యాప్తు అధికారులు ఎలా వ్యవహరించాలనే విషయాలపై అవగాహన పెరుగుతుందన్నారు.



నంద్యాల-నందికొట్కూరు రహదారిలోని సీసీ రోడ్డు దెబ్బతినడంతో ప్రమాదకరంగా మారిన కడ్డీలు

రహదారి అధ్వానం!

గడివేముల: మండల కేంద్రం గడివేములలోని నంద్యాల– నందికొట్కూరు ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు పాల కేంద్రం వద్ద ఉన్న సీసీ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. నీరు నిల్వ ఉండటంతో దెబ్బతిని కడ్డీలు బయటపడ్డాయి. ప్రతి రోజు నిత్యం ప్రభుత్వాధికారులు ప్రయాణిస్తున్నా అటు చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రహదారిలో వందలాది వాహనాలు, బాటసారులు రాకపోకలు సాగుతుంటాయి. వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల టైర్లు కడ్డీలపై పడటంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు లేకపోలేదు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారుల స్పందించి ప్రమాదకరంగా మారిన గుంతను పూడ్చాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఏషియన్ కరాటే జడ్జిగా జగదీష్‌కుమార్

కర్నూలు (టౌన్): భూటాన్ దేశ రాజధాని తింపు నగరంలో నిర్వహించిన ఏషియన్ కరాటే జడ్జి పరీక్షల్లో రాష్ట్రం నుంచి కర్నూలు నగరానికి చెందిన జగదీష్ కుమార్ ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షకు మొత్తం 60 మంది హాజరుకాగా 20 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. జిల్లా నుంచి ఉత్తీర్ణులైన జగదీష్‌కుమార్‌ను పలువురు కరాటే మాస్టర్లు అభినందించారు.

పోటీల్లో ప్రతిభ చాటాలి

కర్నూలు (టౌన్): వచ్చే నెల 2, 3, 4 తేదీల్లో అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరగనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటాలని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి సూచించారు. ఆదివారం స్థానిక కిడ్స్ వరల్డ్ పార్కు ప్రాంగణంలో తైక్వాండో పోటీలు నిర్వహించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు.

అదనపు సెక్షన్లు ఏర్పాటు చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న జాన్సన్ బాబు

కర్నూలు సిటీ: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, ఏపీ మోడల్ స్కూల్స్, గురుకుల పాఠశాలల్లో అదనపు సెక్షన్లు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని కేజీబీవీ స్కూల్, గురుకుల పాఠశాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపాదికన కేజీబీవీ, గురుకుల, మోడల్ స్కూళ్లలో అదనపు సీట్లు పెంచి, పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యా సంస్కరణల పేరుతో నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడంతో 2,350 స్కూళ్లు మూత పడ్డాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 44 వేల ప్రభుత్వ పాఠశాలలకు గాను 6216 పాఠశాలల్లో 10 మంది లోపే విద్యార్థులు ఉన్నారన్నారు. 104 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా ప్రవేశం పొందలేదంటే ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల ఎంత చిత్తశుద్ధితో పని చేస్తుందో అర్థం చేసుకోవచ్చునని చెప్పారు. అదే విధంగా 81 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి మాత్రమే ప్రవేశం పొందారని, ఉపాధ్యాయ పోస్టులు భర్తీకాక పోవడంతో 16 శాతం డ్రాపౌట్స్ పెరిగాయని వివరించారు. తక్షణమే ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న, నగర నాయకులు మధు, బాలాజీ, అజయ్, సూరి, దుర్గన్న పాల్గొన్నారు.

ఓటుకు రూ.50 వేలు

- పార్టీలో చేరితే రూ.4 లక్షలు
- స్టాండింగ్ కమిటీ ఎన్నికల వేళ టీడీపీ బేరసారాలు
- బెడిసికొట్టిన మంత్రి అనుచరుల వ్యూహం
- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ గడువు
- ఐదు స్థానాలకు బరిలో 10 మంది పోటీ
- చివరి రోజు ముగ్గురు నామినేషన్ల ఉపసంహరణ
- వచ్చే నెల 1న ఎన్నికలు



కర్నూలు (టౌన్): రాజకీయంగా పైచేయి సాధించేందుకు టీడీపీ నాయకులు ఎంతకైనా తెగిస్తున్నారు. నగరపాలక స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో బలం లేకున్నా.. పోటీ చేసేందుకు ఐదుగురు నామినేషన్లు వేశారు. అందులో ఇద్దరు వైఎస్సార్‌సీపీకి చెందిన వారే ఉండడం గమనార్హం. పూర్తిస్థాయిలో మద్దతు లేకపోవడంతో మంత్రి అనుచరులు రంగంలోకి దిగారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లకు వల వేస్తున్నారు. రెండు రోజులుగా ఫోన్లు చేస్తున్నారు. పైరవీలు చేస్తున్నారు. అవసరమైతే ఇంటికి వెళ్లి అభ్యర్థిస్తున్నారు. తమ అభ్యర్థులకు బలం లేకున్నా.. 'రెండు నెలల క్రితం అధికారంలోకి వచ్చాం. తమకు ఓటు వేయాలని' సూచిస్తున్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో తమ అభ్యర్థులకు మద్దతుగా ఓటు వేస్తే రూ.50 వేలు ఇస్తాం. పార్టీలో చేరితే రూ.4 లక్షలు ఇస్తాం అంటూ బహిరంగంగా ఆఫర్ ఇస్తున్నారు. స్టాండింగ్ కమిటీలో తమ అభ్యర్థుల గెలుపునకు మంత్రి అనుచరులు బేరసారాలు సాగిస్తున్నారు. ఆదివారం నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉండటంతో ఉదయం నుంచే టీడీపీ నేతలు ముమ్మరంగా ప్రయత్నాలు చేశారు. వారి ప్రయత్నాలు బెడిసికొట్టాయి. బరిలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లతో పార్టీ అధినేతలు మాట్లాడారు. స్టాండింగ్ కమిటీలో ఐదుగురికి మాత్రమే అవకాశం ఉండడంతో వైస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు 8 మంది నామినేషన్లు వేశారు. పోటీ వైస్సార్‌సీపీలోనే ఉండటంతో నేతల సూచనల మేరకు దిగి వచ్చారు. టీడీపీ వలలో పడకుండా స్వచ్ఛందంగా తమ పార్టీలో అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా తప్పుకున్నారు.

ముగిసిన గడువు– బరిలో 10 మంది

ఈనెల 18వ తేదీన నగరపాలక స్టాండింగ్ కమిటీకి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు 15 మంది కార్పొరేటర్లు తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 28 వ తేదీ ఆదివారం నామినేషన్ల ఉపసంహరణ మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. శనివారం 1వ వార్డు కార్పొరేటర్ పి. షాషావలీ (వైఎస్సార్‌సీపీ), 50వ వార్డు కార్పొరేటర్ షేక్ అహమ్మద్ (వైఎస్సార్‌సీపీ) తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. చివరిరోజు ఆదివారం 43వ వార్డు కార్పొరేటర్ కురువ మునెమ్మ (వైఎస్సార్‌సీపీ), 23వ వార్డు కార్పొరేటర్ కటారి పల్లవి (వైఎస్సార్‌సీపీ), 39వ వార్డు కార్పొరేటర్ సాంబశివరావు (వైఎస్సార్‌సీపీ) పోటీ నుంచి తప్పుకున్నారు. ఇక బరిలో వైఎస్సార్‌సీపీ నుంచి 12వ వార్డు కార్పొరేటర్ అన్నెపోగు క్రాంతికుమార్, 31వ వార్డు మిద్దె చిట్టెమ్మ, 7వ వార్డు నుంచి జుబేర్ అహమ్మద్, షేక్ యూనుస్‌బాష, 40వ వార్డు నుంచి విక్రమ సింహారెడ్డి అలాగే టీడీపీ నుంచి నీలోఫర్ షేక్, జక్కుల రమణమ్మ, విజయకుమారి, శివమ్మ, షాజహాన్, పర్వీన్‌షేక్ పోటీలో ఉన్నారు. ఇదిలా ఉండగా వైఎస్సార్‌సీపీకి నగరపాలకలో 34 మంది కార్పొరేటర్ల బలం ఉండగా తెలుగు దేశం పార్టీకి 8 మంది ఉన్నారు. ఇటీవల 7 మంది వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. అభ్యర్థులు లేక వైఎస్సార్‌సీపీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లతోనే టీడీపీ పోటీలో నిలిపింది.

ఆగస్టు 1న ఎన్నికలు

వచ్చే నెల 1వ తేదీన నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో స్టాండింగ్ కమిటీకి ఎన్నికలు నిర్వహించనున్నారు. నగరపాలక ఇన్‌చార్జ్ కమిషనర్ రామలింగేశ్వర్ పర్యవేక్షణ చేస్తారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ ఉంటుంది. పోలింగ్ ముగిసిన తర్వాత అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు కౌంటింగ్ అనంతరం ఫలితాలను ప్రకటిస్తారు. కాగ నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, క్లర్క్ శ్రీకాంత్ పాల్గొన్నారు.